నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని 411 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని, లేని వారు నమోదు, మార్పులు చేర్పులకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

చిన్నారికి ఎమ్మెల్యే పరామర్శ


యశోద ఆస్పత్రిలో చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రామ్‌రెడ్డినగర్‌లో చిన్నారి కృతిని వీధి కుక్కలు గాయపరిచిన సంఘటన తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం యశోద ఆస్పత్రిలో చిన్నారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అలాగే కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ అన్నారు. శుక్రవారం హెచ్‌ఎంటీనగర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగించడానికి ఎఫ్‌టీసీ యంత్రాన్ని తెప్పించారు. ఈ తొలగింపు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దోమల విజృంభణ పెరగకాక ముందే గుర్రపు డెక్క తొలగిస్తున్నా మన్నారు. ఈ విషయంలో ఎంటామాలజీ సిబ్బంది కుడా ఆహర్నిశలు పనిచే స్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్ వైజర్ నరసింహా, బీఆర్‌ఎస్ నేతలు మేకల ముత్యం రెడ్డి, విఠల్ యాదవ్, కట్టు బుచ్చ న్నగౌడ్, మాక్బుల్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రామ మందిరం దైవ సంకల్పం

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్


బాల రాముడి కటౌట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద కరసేవకులు ఏర్పాటు చేసిన బాలరాముడి కటౌట్‌ను మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ శుక్రవారం గుమ్మడికాయను కొట్టి ఆవిష్కరించారు. అయోధ్యలో భవ్య రామ మందిరాన్ని సుందరంగా నిర్మించడం, ఈనెల 22న ప్రధానమంతి నరేంద్ర మోదీచే ప్రారంభించడం దైవ సంకల్పమేనని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కుమారస్వామి, నారాయణ, సోమశేఖర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, బుర్ర రాజేశ్వర్, తాళ్ల బాలకృష్ణ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు వెండి యజ్ఞోపవీతముల వితరణ



ఉప్పల్: ఉప్పల్ శ్రీ లక్ష్మీ హాయగ్రీవ స్వామి దేవాలయం నుంచి అయోధ్యకు వెండి యజ్ఞోపవీతముల వితరణ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలను చేసి పంపారు. ఈ మేరకు శనివారం ఆలయంలో ధర్మకర్తలు సల్లా వీరారెడ్డి, సుధీర్ రెడ్డిల కుటుంబ సభ్యులు వెండి వస్తువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పోగుల దయాకర్ రెడ్డి, ఆకుల మహేందర్, గడ్డం పాపి రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు ఇలా.. నడిచేది ఎలా?



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ భవానీనగర్ కాలనీలోని రామకృష్ణ ఫంక్షన్ హాల్ రోడ్‌లో గత కొంత కాలంగా భూగర్భడ్రైనేజీ పొంగి పొర్లుతోంది. దీంతో అటుగా నడుచుకుంటూ వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా రోడ్డు మొత్తం డ్రైనేజీ నీరు ఉంటే నడిచేది ఎలా అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. గతంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో నిధులు మంజూరు అయ్యాయని అధికారులు తెలిపినప్పటికి ఇప్పటీ వరకు అతీగతి లేదని మల్లాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున్న ఆందోళనకు దిగుతామని హెచ్చారించారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



బోడుప్పల్: 24వ డివిజన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. 24వ డివిజన్ పరిధిలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో డివిజన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దం రాంచందర్, జ్యోతినగర్ కాలనీ అధ్యక్షులు శివగౌడ్, సాయిదుర్గ కాలనీ అధ్యక్షులు రమణ, అమూల్య దివ్య నగర్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ నేత ఎం.జైపాల్ రెడ్డిని మేడిపల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నాయకులు,అభిమానులు



IT మాటేమిటి..?

ఉత్తర తెలంగాణ వైపు ఐటీ విస్తరణకు బీఆర్‌ఎస్ శ్రీకారం


ఐటీ పార్క్‌కు పునాదిరాయి వేస్తున్న నాటి మంత్రి కేటీఆర్(ఫైల్)

- కండ్లకోయ సమీపంలో టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- స్థలాన్ని చదును చేసి.. ఇటుక కూడా పేర్చకుండా..
- అప్పుడు హడావుడి చేసి.. ఆపై నిర్లక్ష్యంగా వదిలేసి..
- బీఆర్‌ఎస్ ఓటమితో.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు
- ప్రభుత్వ పెద్దలు స్పందించాలంటున్న ఐటీ నిపుణులు



మేడ్చల్: ఐటీని ఉత్తర తెలంగాణ వైపు విస్తరిస్తామంటూ ఇచ్చిన హామీలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మేడ్చల్ సమీపంలోని కండ్లకోయలో నూతన ఐటీ పార్క్ నిర్మాణానికి సిద్ధం అయ్యింది. స్థలం కేటాయించి.. అప్పటి ఐటీ శాఖమంత్రి కేటీఆర్ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో ఐటీ టవర్స్ నిర్మాణం కోసం శంకుస్థాపన సైతం చేశారు. ఉత్తర భాగంలో ఐటీ విస్తరణతో వేలమంది ఎంతో మేలు కలుగుతుందని, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అప్పటి మంత్రి కేటీఆర్ అన్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న మార్కెట్ కమిటీ భవనాలు, గిడ్డంగులను ఆగమేఘాల మీద నేలమట్టం చేసి ఆ ప్రాంతాన్ని చదును చేశారు. శంకుస్థాపన సందర్భంగా హడావుడి చేసి ఆ తర్వాత అప్పటి ప్రభుత్వ పెద్దలు అటువైపు కన్నెత్తి చూడలేదు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నా.. చదును చేసిన స్థలంలో కనీసం ఇటుక కూడా పడలేదు. ఆ తర్వాత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయింది. దీంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఐటీ నిపుణులు పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఐటీ టవర్స్ నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ఐటీ మంత్రికి విన్నపాలు..

కండ్లకోయలో పెండింగ్‌లో ఉన్న ఐటీ పార్క్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తిచేయాలని పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఐటీ పార్క్ అసోసియేషన్ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రాలను అందజేశారు. త్వరగా పూర్తిచేసి ఐటీ టవర్స్‌ను అందుబాటులోకి తేవాలని వారు మంత్రిని కోరారు.

లోకల్ నాయకులు పట్టించుకోవాలి..

మేడ్చల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకున్నా.. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టించుకోకపోయినా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఐటీ పార్క్ కోసం పట్టువదలొద్దని పలువురు సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు కోరుతున్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ నేతలు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి కండ్లకోయలో ఐటీ పార్క్ ఏర్పాటు చేయించాలని స్థానిక యువత కోరుతున్నారు. మేడ్చల్‌లో ఐటీ పార్క్ ఏర్పాటయితే మేడ్చల్ జిల్లా యువతతో పాటు సమీప జిల్లాలైన సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ విషయంపై నేతలు దృష్టి సారించాలని కోరుతున్నారు.

మల్లారెడ్డి ప్రతిపాదించేనా..?

ఎమ్మెల్యే మల్లారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయంగా చాలా వైరం ఉండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన ప్రాధాన్యం ఇస్తారా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మల్లారెడ్డి రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి కోసం సీఎంను కలిసి ఐటీ టవర్స్ సాధించాలని మరికొందరు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా..?

గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కండ్లకోయ ఐటీ పార్క్ నూతనంగా ఏర్పడిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనైనా ముందడుగులు వేస్తుందా అని పలువురు చర్చించుకుంటున్నారు. మేడ్చల్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకపోయినా.. సీఎం రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో ఓడిపోయినా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్ సెగ్మెంట్ ఆయనకు రాజకీయంగా పునర్జన్మనిచ్చింది. ఆయన ఎంపీగా పనిచేసినా మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కండ్లకోయ ఐటీ పార్క్ పూర్తి చేస్తారని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయినా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి పనుల్లో తాము వెనుకడుగు వేయమని నిత్యం సీఎం రేవంత్‌రెడ్డి చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేయిస్తామని హామీ ఇస్తున్నారు.

20,21 తేదీల్లో ఓటరు నమోదు, మార్పులు

ఉప్పల్: కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడానికి , లిస్టులో పేరును చూసుకోవడానికి బూత్ స్థాయి అధికారులు ఈ నెల 20, 21 వ తేదీలలో ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో అందుబాటులో ఉంటారని ఉప్పల్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చని, తప్పు ఒప్పుల సవరణ, చిరునామా మార్పు తదితర సవరణలు చేసుకోవచ్చని తెలిపారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

మల్లాపూర్: నాచారం చౌరస్తాలో ఉన్న (ఉప్పల్ గర్ల్స్) తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థలో వచ్చే విద్యా సంవత్సరానికి (2024–25) 5 నుంచి 8 తరగతులకు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఎలాంటి రుసుం లేకుండా వచ్చే నెల ఫిబవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ పి.సౌజన్య తెలిపారు. వివరాల కోసం 7331170806 నెంబర్‌కు సంప్రదించవచ్చు అని తెలిపారు.

అమ్మవారి ఆలయానికి భూమి పూజ



మౌలాలి: మౌలాలి భరత్‌నగర్‌లో అమ్మవారి ఆలయ నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. ఆలయ పునర్‌నిర్మాణానికి తనవంతు సహాయసహకారాలు అందచేస్తానని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ రాజేష్‌యాదవ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించడమే సంకల్ప యాత్ర లక్ష్యం


సంకల్ప యాత్ర ఉద్దేశ్యాలను వివరిస్తున్న వైద్యాధికారి

బోడుప్పల్: కేంద్ర సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు 100 శాతం అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశ్యమని డిప్యూటీ సెక్రటరీ రఘువంశీ అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్, భారత్ ప్రభుత్వం తరుపున శుక్రవారం బోడుప్పల్ ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు , ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ యాత్రలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ సంబంధిత పథకాలపై ఆడియో విజువల్‌వ్యాన్లు ద్వార అవగాహన కల్పిస్తున్నా మన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 26వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి, బోడుప్పల్ 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు తదిరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ భూమిపై బడానేతల కన్ను’

మేడిపల్లి: వీధి వ్యాపారుల కోసం లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన దుకాణాలను ప్రారంభించకముందే నేల మట్టం చేశారని పీర్జాదిగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు రూపొందించిన అంచనాలతో రెండేళ్ల క్రింతం 15వ డివిజన్ పర్వతాపూర్ రోడ్డు సర్వే నెంబర్–103 ప్రభుత్వ భూమిలో స్ట్రీట్ వెండర్స్ కోసం షాపులు నిర్మించినా లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. ప్రభుత్వ స్థలం మీద కన్నేసి కోట్లరూపాయల ప్రభుత్వ భూమిని అమ్ముకుంటున్న వారిలో బడా నేతల హస్తం ఉందని ఆరోపించారు.ఈ విషయంపై పీర్జాదిగూడ మున్సిపల్ కమీషనర్‌కు పిర్యాదు చేశారు.


కమిషనర్ నమ్యానాయక్‌కు సమస్యలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిరునామా మార్పునకు దరఖాస్తు చేసుకోవాలి

బోడుప్పల్: ఓటర్ నమోదులో భాగంగా ఓటర్ కార్డులో చిరునామా మార్పు కోసం ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21తేదీల్లో బోడుప్పల్‌లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

మేడిపల్లి సీఐగా గోవిందరెడ్డి



మేడిపల్లి: మేడిపల్లి సీఐగా గోవింద రెడ్డి నియమితులయ్యారు. గురువారం రాచకొండ పోలీస్ కమీషనర్ జి.సుధీర్ బాబు ఉత్తర్వులను జారీ చేశారు. మేడిపల్లి సీఐగా విధులను నిర్వర్తిస్తున్న పి.సైదులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గోవింద రెడ్డి మేడిపల్లి సీఐగా నియమితులయ్యారు.

ఆర్థిక సహాయం అందజేత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌కు చెందిన శ్రీనివాస్ అతని భార్య ఇద్దరు మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్ వారి కుటుంబసభ్యులను పరామర్శించి వారి అంత్యక్రియలకు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందచేశారు.

యువకులను వేధిస్తున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోండి

హిమాయత్‌నగర్: వైద్య వృత్తిలో ఉండి యువకులను లోబర్చుకుని లైంగికంగా వేధిస్తున్న తన భర్త అయిన డాక్టర్ జవ్వాద్ అలి ఖాజాపై చర్యలు తీసుకోవాలని మౌలాలికి చెందిన బాధితురాలు డిమాండ్ చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మౌలాలి, హెచ్ బీ కాలనీకి చెందిన డాక్టర్ జవ్వాద్ అలి ఖాజాతో తనకు 2014లో వివాహం అయిందని, తమకు ఇద్దరూ పిల్లలు ఉన్నారని ఆమె తెలిపారు. ఆ తరువాత అధిక కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేశారన్నారు. తమ ఇంటిపై అంతస్తులో అద్దెకు ఉంటున్న విష్ణువర్ధన్ రెడ్డి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంతో పాటు సూసైడ్ లేఖలో జావ్వాద్ తనని లైంగికంగా వేధింపులకు పాల్పడ్డారని తెలిపాడన్నారు. దీంతో కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా జవ్వాద్ తనకు ఉన్న పరిచయాలతో పోలీసులతో కుమ్మక్కై పరారయ్యారని ఆమె ఆరోపించారు.

మెడికల్ షాపుల్లో డ్రగ్ కంట్రోలర్ అధికారుల తనిఖీ

కాప్రా: కాప్రా సర్కిల్‌లో శుక్రవారం డ్రగ్స్ కంట్రోలర్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు మెడికల్ షాపుల నిర్వాహకులు సరైన పద్ధతిలో ఇన్సులిన్ ఇంజక్షన్లు నిల్వ చేయడంలేదని గుర్తించారు. ఫ్రిడ్జ్‌లో భద్రపర్చాల్సిన ఇన్సులిన్ ఇంజక్షన్లు కాప్రా జైజవాన్ కాలనీ రాజరాజేశ్వర మెడికల్ డిస్ట్రిబ్యూటర్ వి.సరని బయట ర్యాక్‌లో నిల్వ చేసినట్లు గుర్తించారు అధికారులు. దాదాపు రూ.5 లక్షల విలువైన ఇన్సులిన్ ఇంజక్షన్లు సీజ్ చేశారు.

అవుషాపూర్‌లో పౌష్టికాహారం పంపిణీ

ఘట్‌కేసర్: అవుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, కేంద్రంలోని చిన్నారులతో మాట్లాడారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తల్లులు, గర్భిణులకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌వీఎం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలను ఉద్దేశించి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిన ఘనత మల్కాజిగిరి నియోజకవర్గానికి దక్కుతుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవడానికి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించినట్లు ఈ నిధులతో చేపట్టబోయే పనులకు సమస్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు మహ్మద్ తోఫిక్, మహ్మద్ రఫీ, సందీప్, రఘుపతిరెడ్డి, గిరిబాబు, అరుణ్, శ్రీకాంత్ యాదవ్, సంధ్యారాణి, కోటేష్, సతీష్‌గౌడ్, బాబు లింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ 33/11 కేవి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామిరెడ్డి తెలిపారు. హెచ్‌ఎంటి నగర్ వీధి నంబర్ 1 నుంచి 11 వరకు, సర్వసతి నగర్, బాపూజీ నగర్, హైకోర్టు కాలనీ, బ్యాంక్ కాలనీ, అంబేద్కర్‌నగర్, సైంటిస్టు కాలని, నాగేందర్‌నగర్, జహీర్‌నగర్, సాయి ఎన్‌క్లేవ్, హబ్సిగూడ వీధి నంబర్ –7 తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్ పరిధిలో..

కళ్యాణపురి 11కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ రెడ్డి తెలిపారు. అమీనా కాంప్లెక్స్, జహీర్‌నగర్, అంబేద్కర్ నగర్, ఇందిరానగర్, బ్యాంక్ కాలనీ, ఈస్ట్ కళ్యాణపురి, బాలాజీ ఎన్‌క్లేవ్, అజీమత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫర ఉండదన్నారు. 11 కేవి చిలుకానగర్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం మధ్యాహ్నం రెండు నుంచి 4 గంటల వరకు గణేష్‌నగర్, సెవన్ హిల్స్ కాలని, సాయిరాంనగర్, శ్రీనివాస్ హైట్స్, అపూరూపా హైట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మల్కాజిగిరిలో...

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ బీజెఆర్ నగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయని ఏఈ సుదీప్‌రెడ్డి తెలిపారు. బీజెఆర్‌నగర్, సత్తిరెడ్డినగర్ కాలనీ,సత్యరాఘవేంద్రనగర్ కాలనీ, వెంకటేశ్వరనగర్, ఓల్డ్ మల్కాజిగిరి పార్ట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్‌లో...

మల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం నాచారం 11 కేవీ సాయిబాబా దేవాలయం ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగరాజు తెలిపారు. దీంతో అన్నపూర్ణ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు

అల్వాల్: అల్వాల్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను తెలియజేశారు. కాలనీలో పాతకాలం నాటి డ్రైనేజీ వ్యవస్థతో మురుగునీరు రోడ్లపై పారుతూ కాలనీవాసులకు, పాదచారులకు ఇబ్బందిగా మారుతుందని, కొత్త చెరువు పూర్తిగా గుర్రపుడెక్కతో నిండి దోమలకు నివాసమై కాలనీవాసులకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే పరిష్కరించాలని వారు వినతి పత్రం అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే తన ముఖ్య ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీంద్రరావు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, రాము, లక్ష్మీనారాయణ, డీజీఎం సాంబయ్య, మేనేజర్ మల్లికార్జుననాయక్ పాల్గొన్నారు.